సాక్షి
సిద్దిపేట

ఆదివారం । 29 । జూన్ । 2025

సర్కారీ స్కూళ్లకు సలామ్!



సండే స్పెషల్

కార్పొరేట్, ప్రైవేటు స్కూళ్లకు దీటుగా సర్కారు బడులను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయి. పిల్లల తల్లిదండ్రుల్లో ప్రైవేటు బడిపై మోజును తగ్గించి ప్రభుత్వ పాఠశాలలపై మక్కువ కలిగేలా ఉపాధ్యాయులు బడిబాట పేరుతో పడిన కష్టం తమ స్కూళ్లలో పెరిగిన ప్రవేశాలతో మరిచిపోయేలా చేసింది. ఆధునిక వసతులతోపాటు విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, బ్యాగులు, పెన్నులు, టైలు, షూస్, బెల్టులు, రవాణా సౌకర్యాన్ని తల్లిదండ్రులపై భారంపడకుండా ఉపాధ్యాయులు, దాతల సహకారంతో సమకూరుస్తుండటంతో ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెరిగాయి. ప్రభుత్వం నిర్దేశించుకున్న లక్ష్యాన్ని కొన్ని పాఠశాలలు అధిగమించగా మరికొన్ని లక్ష్యానికి దగ్గరలో నిలిచాయి. దీంతో 'సర్కారు స్కూళ్లకు సలామ్'అంటూ ప్రవేశాలకోసం విద్యార్థులు వారి తల్లిదండ్రులతో క్యూలు కట్టిన స్కూళ్లపై ఈ వారం సండే స్పెషల్.

8లో

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

బీసీ సంక్షేమ శాఖ అధికారి నాగరాజమ్మ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఉచితంగా సివిల్ సర్వీసెస్ లాంగ్ టర్మ్ కోచింగ్ ఇవ్వనున్నట్లు, అందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి నాగరాజమ్మ తెలిపారు. హైదరాబాద్‌లోని బీసీ స్టడీ సర్కిల్‌లో ఈ శిక్షణ తరగతులు జూలై 27 నుంచి అందించనున్నట్లు చెప్పారు. ఆసక్తి కల్గిన అభ్యర్థులు జూలై 7 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. జూలై 12న నిర్వహించే ఆన్‌లైన్ స్క్రీనింగ్ టెస్ట్ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు దరఖాస్తులు చేసుకోండి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): 2025 సంవత్సరానికి గాను జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల కోసం కేంద్ర మానవవనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఆసక్తి కలిగిన ప్రభుత్వ, జిల్లా, మండల పరిషత్, ఆదర్శ, కేజీబీవీలు, గురుకులాల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు జూలై 13లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. దరఖాస్తు చేసిన ఫారంలను జూలై 15లోగా జిల్లా విద్యాశాఖ అధాకారి కార్యాలయంలో అందించాలన్నారు.

లక్కీ డ్రా పద్ధతిలో సీట్ల ఎంపిక...



లక్కీ డ్రా పద్ధతిలో విద్యార్థులను ఎంపిక చేస్తున్న అధికారులు

సిద్దిపేటరూరల్: 2025–26 విద్యా సంవత్సరానికి గాను బెస్ట్ అవైలబుల్ ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్న వారిని విద్యార్థుల ఎంపిక డ్రా నిర్వహించారు. శనివారం కలెక్టరేట్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బెస్ట్ అవైలబుల్ స్కూల్ పథకం ద్వారా షెడ్యూల్డ్ కులాల విద్యార్థులకు ఎంపిక చేసిన ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత విద్యను అందిస్తామన్నారు. విద్యార్థులను డ్రా పద్ధతిలో ఎంపిక చేస్తామని, వారిని సిద్దిపేట, గజ్వేల్, ప్రజ్ఞాపూర్‌లలోని ఎంపిక చేసిన స్కూల్‌లలో వసతితో కూడిన ఉచిత విద్యను అందిస్తామని ఆమె వివరించారు. ఒకటో తరగతికి 225 మంది దరఖాస్తు చేసుకోగా.. 87 విద్యార్థులను ఎంపిక చేశారు. 5 తరగతికి 132 విద్యార్థులకుగాను 89 మంది విద్యార్థులను లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి కవిత, డీఈఓ శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయికి 20మంది ఎంపిక

సిద్దిపేటజోన్: జూలై 1 ,2వ తేదీల్లో హకీంపేట క్రీడాపాఠశాల రాష్ట్ర స్థాయి ఎంపిక పోటీలకు సిద్దిపేట జిల్లా నుంచి 18 మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. ఈ మేరకు శనివారం జిల్లా క్రీడల శాఖ అధికారి వెంకట్ నర్సయ్య వివరాలు వెల్లడించారు. ఈనెల 24న సిద్దిపేట గ్రీన్ ఫీల్డ్ స్టేడియంలో క్రీడా పాఠశాలల్లో నాల్గవ తరగతిలో ప్రవేశాల కోసం జిల్లా స్థాయిలో ఎంపిక నిర్వహించినట్టు పేర్కొన్నారు. ఉత్తమ ప్రతిభ చూపిన వారిని రాష్ట్ర స్థాయి ఎంపిక చేసినట్టు తెలిపారు. బాలుర విభాగంలో ఆత్రేయ, రేవంత్ నాయక్, విశ్వాస్, శ్రేయస్, అక్షిత్, అభినవ్, చరణ్, సుస్వాంత్, రక్షిత్ కుమార్, మనిత్‌లు బాలికల విభాగంలో ప్రనిషి, వేద సహిత, దేవాన్సీ, హర్షిత, గాయత్రి, రష్మిత, చరిష్మా, కృతికలు ఎంపికయ్యారన్నారు. ఎంపిక అయిన వారు జూలై ఒకటిన ఉదయం10 గంటలకు స్టేడియం ప్రాంగణంలో సంబంధించిన పత్రాలతో హాజరుకావాలని సూచించారు.

ఇంజినీరింగ్‌లో ఉచిత శిక్షణ

గజ్వేల్‌రూరల్: సత్యసాయి స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో డేటా ఇంజినీర్ కోర్సులో యువతకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు భగవాన్ శ్రీసత్యసాయి సేవా సంస్థ ప్రతినిధులు తెలిపారు. గజ్వేల్‌లో శనివారం వారు మాట్లాడుతూ 2022–2025 మధ్య బీఎస్సీ, ఎమ్మెస్సీ, బీ టెక్, ఎంటెక్ లేదా ఎంసీఏ పూర్తి చేసిన వారు ఈ శిక్షణలో పాల్గొనేందుకు అర్హులన్నారు. ఎంపికైన అభ్యర్థులకు హైదరాబాద్‌లోని సత్యసాయి స్కిల్ సెంటర్‌లో బేసిక్, అడ్వాన్స్‌డ్ పైథాన్, ఎస్‌క్యూఎల్, బీఐ టూల్స్‌తో పాటు సాఫ్ట్ స్కిల్స్‌లో 90 రోజులపాటు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ పొందిన వారికి ఉద్యోగాలు కల్పించడంలో సహకారం ఉంటుందని చెప్పారు. ఆసక్తి గలవారు 4లోగా www.rethu.aiలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 90523 72023 నంబరులో సంప్రదించాలని సూచించారు.

వైద్య కళాశాల హుళక్కేనా..!

పీజీ కళాశాల మంజూరు చేస్తామని మంత్రి దామోదర ప్రకటన

- ఎంబీబీఎస్ లేనప్పుడు.. పీజీతో ఏం ప్రయోజనం
- ప్రియాంకగాంధీ హామీ ఏమైందని విద్యార్థుల ప్రశ్న



ఎన్నికల ప్రచారంలో ప్రియాంక గాంధీ, పక్కన పొన్నం (ఫైల్)

హుస్నాబాద్: గత శాసన సభ ఎన్నికల ప్రచారంలో వైద్య కళాశాల మంజూరుపై కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంక గాంధీ ఇచ్చిన హామీ నీటిమూటగానే మిగిలింది. ఎంతో ఆశతో ఎదురు చూసిన విద్యార్థులకు నిరాశే మిగిలింది. శుక్రవారం పట్టణంలో జరిగిన సభలో మంత్రుల మాటల్లో వైద్య కళాశాల ఇక రాదని తేలిపోయింది. హుస్నాబాద్ ఎమ్మెల్యేగా పొన్నం ప్రభాకర్‌ను గెలిపిస్తే వైద్య కళాశాలను మంజూరు చేస్తామని వేలాది మంది సమక్షంలో ప్రియాంకగాంధీ ప్రకటించారు. ఎన్నికల్లో పొన్నం గెలిచారు. మంత్రి కూడా అయ్యారు. హుస్నాబాద్‌లో వైద్య కళాశాల కోసం మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రయత్నాలు మొదలెట్టారు. జిల్లెల్లగడ్డలో వైద్య కళాశాల కోసం ఒక్కటికి రెండు సార్లు రెవెన్యూ అధికారులను పంపించి స్థల సేకరణ చేయించారు. అప్పటి జిల్లా కలెక్టర్ మను చౌదరి సైతం స్థలాన్ని పరిశీలించారు. దీంతో ఈ ప్రాంత విద్యార్థుల్లో ఆశలు చిగురించాయి. మెడికల్ కళాశాల మంజూరు కావాలంటే.. 250 పడకల ఆస్పత్రి ఉండాలని నిబంధనలు ఉన్నాయి. హుస్నాబాద్ పట్టణంలో ఇప్పటికే 50 పడకల ఆస్పత్రితో పాటుగా మరో 50 పడకల మాతా శిశు సంక్షేమ ఆరోగ్య కేంద్రం భవనం పూర్తి చేశారు. మంత్రి పొన్నం చొరవతో ప్రభుత్వం మరో 150 పడకల ఆస్పత్రి మంజూరు చేసింది. పరిపాలన అనుమతులతో పాటుగా భవన నిర్మాణానికి రూ.82 కోట్లు మంజూరు చేసింది. 250 పడకల ఆస్పత్రి ప్రజలకు అందుబాటులోకి వస్తే మెడికల్ కళాశాల వచ్చినట్టేనని ఈ ప్రాంత ప్రజలు విశ్వసించారు.

ఎంబీబీఎస్ పోయింది.. పీజీ వచ్చింది

హుస్నాబాద్ శుక్రవారం జరిగిన సభలో వైద్య కళాశాల రాబోదని మంత్రులు పరోక్షంగా సంకేతాలు ఇచ్చారు. ఎంబీబీఎస్ కళాశాల ఊసెత్తకుండా.. 50 పడకల పీజీ మెడికల్ కళాశాలను మంజూరు చేస్తున్నట్లు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ప్రకటించారు. ఎంబీబీఎస్ పూర్తి చేసి పీజీ చదువుకునే విద్యార్థులకు ఇది దోహదపడుతుంది. అయితే.. ఎంబీబీఎస్ కళాశాల లేకుండా.. పీజీ కళాశాల వస్తే లాభం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

లక్ష్యాలను సాధించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ హైమావతి

- ఆయిల్‌పామ్ రైతులకు ప్రోత్సాహం
- జూలై 15లోగా పెండింగ్ పనులు పూర్తి
- కలెక్టర్ కె.హైమావతి

సిద్దిపేటరూరల్: నిర్దేశించిన లక్ష్యాలను సాధించడానికి అధికారులు జిల్లాను మొదటి స్థానంలో నిలబెట్టాలని కలెక్టర్ కే.హైమవతి అధికారులను ఆదేశించారు. శనివారం వ్యవసాయ, ఉద్యాన, పశు సంవర్ధక, మత్స్య శాఖల అధికారులతో సమీక్షించారు. వారికి కేటాయించిన లక్ష్యాలపై సమాలోచన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్ని శాఖలు వారికి నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఆయిల్‌పాం సాగు పెరిగేలా రైతులను ప్రోత్సహించడం, అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, క్షేత్రస్థాయిలో సిబ్బంది పనులను అధికారులు పర్యవేక్షించాలని కోరారు. మండల స్థాయిలో పెండింగ్‌లో ఉన్న పనులను జూలై 15వ తేదీ లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. వ్యవసాయంతో పాటు వ్యవసాయ అనుబంధ రంగాలలో రైతులను ప్రోత్సహించాలని కోరారు. చివరగా ఉద్యాన దర్శిని పుస్తకాన్ని కలెక్టర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్, డీఏఓ రాధిక, ఉద్యాన శాఖ అధికారి సువర్ణ, మత్స్య శాఖ అధికారి మల్లేశం, పశుసంవర్ధక శాఖ అధికారి కొండల్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రతి మొక్క బతకాలి

వనమహోత్సవ లక్ష్యాన్ని అధికారులు తప్పనిసరిగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లా గ్రామపంచాయతీ, పంచాయతీరాజ్ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో వనమహోత్సవం కార్యక్రమాన్ని ముందస్తు కార్యాచరణతో లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా గుర్తించిన వివిధ ప్రాంతాల్లో మొక్కలు నాటాలన్నారు. సకాలంలో ఫర్టిలైజర్, నీటిని అందిస్తే మొక్కలు ఏపుగా పెరిగే ఆస్కారం ఉందన్నారు. పెట్టిన ప్రతి మొక్క బతకాలని, అధికారులు తరచూ పర్యవేక్షించాలని కోరారు. ఉద్యానవన శాఖలో 1,335 ఎకరాల లక్ష్యానికి గాను ఇప్పటికి 428 రైతుల నుంచి 748 ఎకరాల్లో పలు రకాల తోటల పెంచేందుకు సిద్ధం చేశారని, ఆగస్టు లోపు పూర్తి చేయాలన్నారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా చూడవచ్చని, బహిరంగ ప్రదేశాలలో చెత్త, డ్రైనేజీలు పొంగడం లాంటివి ఉన్నట్లయితే వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కాగా, స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ–2025 గోడ పత్రికను కలెక్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో సీఈవో రమేష్, డీఆర్డీఓ జయదేవ్ ఆర్య, డీపీఓ దేవకీదేవి, పంచాయతీ రాజ్ ఈఈ లు శ్రీనివాస్ రెడ్డి, చిరంజీవులు తదితరులు పాల్గొన్నారు.

బదిలీలు, పదోన్నతుల కోసం కృషి



గౌరారంలో వెంకట్‌రెడ్డికి జ్ఞాపిక అందజేస్తున్న ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి, తదితరులు

ఉపాధ్యాయులకు ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి హామీ

వర్గల్(గజ్వేల్): ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించే సత్తా కలిగిన ఏకైక సంఘం పీఆర్‌టీయూ అని ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. శనివారం మండల సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి అధ్యక్షతన వర్గల్ మండలం గౌరారం ఫంక్షన్‌హాల్‌లో చౌదరిపల్లి జెడ్పీహైస్కూల్ హెచ్‌ఎం ఇటిక్యాల వెంకట్ రెడ్డి ఉద్యోగ విరమణ సభకు ఆయన హాజరయ్యారు. వెంకట్‌రెడ్డి దంపతులకు జ్ఞాపికను అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల ప్రయోజనాలే లక్ష్యంగా 50 సంవత్సరాలుగా పీఆర్‌టీయూ కృషి చేస్తుందని చెప్పారు. ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులు ఇప్పిస్తామని, 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ వర్తింపజేసే విధంగా కృషి చేస్తామని, షరతులు లేకుండా అన్ని కార్పొరేట్ ఆసుపత్రులలో వైద్యం అందేలా హెల్త్ కార్డులు ఇప్పిస్తామని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డీఈఓ శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుండు లక్ష్మణ్, దామోదర్‌రెడ్డి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మల్లుగారి ఇంద్రసేనారెడ్డి, ఆదరాసుపల్లి శశిధర్‌శర్మ, ఎంఈఓ సునీత, వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

7న ఆవిర్భావ దినోత్సవం

చేర్యాల(సిద్దిపేట): ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని ఎమ్మెస్పీ జాతీయ నాయకుడు, జిల్లా ఇన్‌చార్జి మంద కుమార్ పిలుపునిచ్చారు. పట్టణ కేంద్రంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జూలై 7న ప్రతి గ్రామంలో మాదిగల ఆత్మగౌరవ ప్రతీకైన ఎమ్మార్పీఎస్ జెండాలు ఆవిష్కరించాలని పిలుపు నిచ్చారు. నాయకులు ప్రసాద్, యాదగిరి, బాబు, బాల్‌నర్సయ్య, వెంకటయ్య, ఐలయ్య, స్వామి, భూపతి, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేటకు చేరిన సైకిల్ యాత్ర

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): హుస్నాబాద్ పేరును భార్గవాపురంగా మార్చాలని సామాజిక ఉద్యమకారుడు పిడిశెట్టి రాజు చేస్తున్న సైకిల్ యాత్ర శనివారం రంగదాంపల్లి అమరవీరుల స్తూపం వద్దకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకతీయుల కాలంలో హుస్నాబాద్ పేరు భార్గవపురంగా ఉండేదన్నారు. హుస్నాబాద్‌లోని రేణుకా ఎల్లమ్మ, భార్గవ పరశురాముల పేరు మీదు భార్గవపురం అనే నామకరణం ఉండేదని, కాని నిజాం కాలంలో దానిని హుస్నాబాద్‌గా మార్చారని వాపోయారు. తమ పూర్వీకులు పెట్టిన భార్గవపురం పేరుగా మార్చాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందించాక తన యాత్ర ముగుస్తుందని చెప్పారు. కార్యక్రమంలో వరికోలు శ్రీనివాస్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాధాన్యం కల్పిస్తాం

యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు

వర్గల్(గజ్వేల్): స్థానిక సంస్థల ఎన్నికలలో యువజన కాంగ్రెస్ నాయకులకు ప్రాధాన్యం కల్పిస్తామని యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డి అన్నారు. వర్గల్ మండలం మల్లారెడ్డి పల్లిలో శనివారం సందర్శించారు. ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలకు నాయకులు, శ్రేణులు సిద్ధంగా ఉండాలన్నారు. రాష్ట్ర నేత ఖలీద్ అహ్మద్, రాష్ట్ర నాయకులు శ్యామ్‌సుందర్‌రెడ్డి, మాజిద్‌ఖాన్, సాయికుమార్, రింకురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్ ట్రిబ్యునల్‌లో కేసు వేసిందే కాంగ్రెస్

- గౌరవెల్లిని 95శాతం పూర్తి చేశాం
- నిర్వాసితులను మోసం చేసిన పొన్నం
- మాజీ ఎమ్మెల్యే సతీష్‌కుమార్ ధ్వజం



మాట్లాడుతున్న సతీష్‌కుమార్

హుస్నాబాద్: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే గౌరవెల్లి ప్రాజెక్టు 95 శాతం పూర్తి చేశామని, ప్రాజెక్టును అడ్డుకోవడానికి గ్రీన్ ట్రిబ్యునల్‌లో కేసు వేసిందే కాంగ్రెస్ నాయకులని మాజీ ఎమ్మెల్యే సతీష్‌కుమార అన్నారు. శనివారం విలేకరులతో ఆయన మాట్లాడారు. నలుగురు మంత్రుల పర్యటనలో అవాకులు, చెవాకులు, ఉపన్యాసాలే తప్పఈ ప్రాంతానికి ఒరగబెట్టిందేమీ లేదన్నారు. తాము మంజూరు చేసిన పనులకు శంకుస్థాపనలు చేయడం గొప్పనా అని ప్రశ్నించారు. గౌరవెల్లి ప్రాజెక్టు నిర్వాసితులకు ఎకరాకు రూ.30 లక్షలు ఇప్పిస్తానని హామీ ఇచ్చిన పొన్నం ప్రభాకర్.. మంత్రి అయిన తర్వాత రూ.17 లక్షలు ఇచ్చి నిర్వాసితులను నిండా మోసం చేశారని మండిపడ్డారు. మెడికల్ కళాశాల ఏర్పాటు చేయకుండా పీజీ మెడికల్ కళాశాల ఏలా సాధ్యమని ప్రశ్నించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, బాలికల జూనియర్ కళాశాల, మాతా శిశు సంరక్షణ ఆరోగ్య కేంద్ర భవనం, సమీకృత కార్యాలయాల భవనం, పాలిటెక్నిక్ కళాశాల, ఏసీపీ కార్యాలయం తమ హయాంలో పూర్తి చేశామన్నారు. ఇంజనీరింగ్ కళాశాల తరగతుల నిర్వాహణకు తాము కట్టించిన పాలిటెక్నిక్ కళాశాల గతైందని ఎద్దేవా చేశారు. ప్రభుత్వ ఆస్పత్రి అంబులెన్స్ కోసం మంత్రి అనుచరుడు చందాలు వసూలు చేసిన డబ్బులు ఎక్కడున్నాయని ప్రశ్నించారు. ఈ సమావేశంలో హన్మకొండ మాజీ జెడ్పీ చైర్మన్ సుధీర్ కుమార్, మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ రాయిరెడ్డి రాజిరెడ్డి, మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మికి 'గెజిటెడ్' గ్రహణం

- సంతకాలు చేసేందుకు గెజిటెడ్ అధికారుల నిరాసక్తత
- కార్యాలయాల చుట్టూ లబ్ధిదారుల ప్రదక్షిణలు



కల్యాణ లక్ష్మి దరఖాస్తు పత్రాలను చూపుతున్న బాధితులు

మిరుదొడ్డి(దుబ్బాక): కల్యాణ లక్ష్మి పథకానికి దరఖాస్తులు చేసుకుంటున్న లబ్దిదారులకు ఆదిలోనే హంసపాదెదురవుతోంది. అన్ని అర్హతలు కలిగిన పత్రాలను సమకూర్చినప్పటికీ వాటిని ధ్రువపర్చి సంతకాలు చేయాల్సిన గెజిటెడ్ అధికారులు ససేమిరా అంటున్నారు. దీంతో లబ్ధిదారులు నిరాశా నిస్పృహాలకు గురవుతున్నామని కల్యాణ లక్ష్మి బాధితుఉలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మిరుదొడ్డి మండల కేంద్రానికి చెందిన మొగుళ్ళ ఐలవ్వ, మొగుళ్ల లక్ష్మి, భూపల్లి పద్మలు తమ తమ కూతుళ్లకు గత ఐదు నెలల క్రితం వివాహాలు జరిపించారు. కల్యాణ లక్ష్మి పథకం కోసం దరఖాస్తులు చేసుకుందామంటే గెజిటెడ్ అధికారులు సంతకాలు పెట్టకుండా తిప్పుకుంటున్నారని వాపోతున్నారు. క్షేత్ర స్థాయిలో అధికారులు పరిశీలన జరిపాక అర్హులుగా గుర్తించి సంతకాలు చేయాల్సిన గెజిటెడ్ అధికారులు ససేమిరా అంటుండటంతో నిత్యం కార్యాలయాల చుట్టూ నెలల తరబడి తిరుగుతున్నామని బాధితులు వాపోతున్నారు. కాగా జిల్లాలో కొన్ని సందర్భాల్లో కల్యాణ లక్ష్మి పథకాన్ని పక్కదారి పట్టించడంతో పలువురిపై కేసులు నమోదైనట్లు గుర్తించిన అధికారులు ధ్రువ పత్రాలపై సంతకాలు చేయడానికి గెజిటెడ్ అధికారులు వెనకంజ వేస్తున్నట్లు సమాచారం.

ప్రతిభకు పురస్కారం

కేంద్రీయ విద్యాలయానికి 5వ స్థానం



ప్రశంసాపత్రం అందుకుంటున్న ప్రిన్సిపాల్ సూర్యప్రకాశ్

సిద్దిపేటఅర్బన్: సీబీఎస్ఈ పదవ తరగతి ఫలితాల్లో హైదరాబాద్ రీజియన్ స్థాయిలో సిద్దిపేట కేంద్రీయ విద్యాలయం 5వ స్థానంలో నిలిచింది. 74 పాఠశాలలకు గాను సిద్దిపేట కేంద్రీయ విద్యాలయం ఐదో స్థానం దక్కించుకుంది. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రిన్సిపాళ్ల సమ్మేళనంలో పాఠశాల ప్రిన్సిపాల్ సూర్యప్రకాశ్ కేంద్రీయ విద్యాలయ సమితి కమిషనర్ విధి పాండే చేతులు మీదుగా బహుమతి, ప్రశంసాపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సూర్యప్రకాశ్ మాట్లాడుతూ ఈ అవార్డు వెనుక సిద్దిపేట కేంద్రీయ విద్యాలయం నిలవడంలో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల కృషి ఎంతో ఉందన్నారు. అలాగే ఈ విద్యాసంవత్సరం 9వ తరగతిలో ఒక సీటు, పదవ తరగతిలో ఏడు సీట్లు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. జూలై 10వ తేదీలోగా అర్హత కలిగిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని, కేంద్రీయ విద్యాలయ మార్గదర్శకాల మేరకు సీట్లు భర్తీ చేస్తామని తెలిపారు.

పెండింగ్ కేసులపై సత్వర నిర్ణయం



జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయిరమాదేవి

మాట్లాడుతున్న సాయిరమాదేవి

సిద్దిపేటకమాన్: జిల్లాలో పెండింగ్‌లో ఉన్న కేసులలో పోలీసు శాఖ తగు చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయిరమాదేవి అన్నారు. సిద్దిపేట జిల్లా కోర్టులో కలెక్టర్ హైమావతి, అడిషనల్ డీసీపీ సుభాష్ చంద్రబోస్, ఏసీపీలతో శనివారం ఆమె సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కోర్టులలో పెండింగ్ కేసులలో పోలీసు శాఖ తరపున తీసుకోవాల్సిన చర్యల గురించి తగు ఆదేశాలు జారీ చేశారు. సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక కోర్టు భవనాల స్థల సేకరణపై జిల్లా కలెక్టర్‌తో చర్చించినట్లు పేర్కొన్నారు. సమావేశంలో అడిషనల్ జిల్లా సీనియర్ జడ్జి జయప్రసాద్, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, ఏసీపీలు రవీందర్‌రెడ్డి, సీఐలు వాసుదేవరావు, ఉపేందర్, విద్యాసాగర్, శ్రీను, సైదా, ఎస్ఐ రాజేష్ పాల్గొన్నారు.

ఇన్‌చార్జీల పాలన ఇంకెన్నాళ్లు..?

మల్లన్న ఆలయంలో రెగ్యులర్ ఈవో ఎక్కడ..?

- వారంలో ఒకటి, రెండూ రోజులు మాత్రమే ఆలయానికి..
- ఏడాదికి రూ.20 కోట్లకుపైగా ఆదాయం
- అయినా.. భక్తుల ఇబ్బందులు పట్టవా..?



మల్లన్న రాజగోపురం

కొమురవెల్లి(సిద్దిపేట): తెలంగాణతో ప్రసిద్ధి చెందిన కొమురవెల్లి మల్లికార్జున స్వామి రెగ్యులర్ ఈవో నియామకం కలగానే మిగిలిపోయింది. డిప్యూటీ కమిషనర్ క్యాడర్ కలిగిన ఆలయానికి అసిస్టెంట్ కమిషనర్లకు ఇన్‌చార్జీలు ఇచ్చి దేవాదాయ శాఖ కాలం వెళ్లదీస్తోంది. 2020లో ఈవో వెంకటేశ్ బదిలీపై వెళ్లగా హైదరాబాద్ అసిస్టెంట్ కమిషనర్‌గా పని చేస్తున్న బాలాజీకి మల్లన్న ఆలయానికి ఇన్‌చార్జి ఈవోగా అదనపు బాధ్యతలు అప్పగించారు. బాలాజీ 2024 డిసెంబర్‌లో పదవీ విరమణ పొందడంతో హైదరాబాద్ దేవాదాయశాఖ కార్యాలయంలో గెజిటెడ్ సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న రామాంజనేయులుకు మల్లన్న ఆలయ ఈవోగా అదనపు బాధ్యతలు అప్పగించారు. 2025 ఏప్రిల్‌లో రామాంజనేయులు అదనపు బాధ్యతలు తొలగించి హైదరాబాద్‌లో చిక్కడపల్లి వెంకటేశ్వర్ల స్వామి అలయ ఈవో అన్నపూర్ణకు కొమురవెల్లి మల్లన్న ఈవోగా అదనపు బాధ్యతలు అప్పగించారు. కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయ ఇన్‌చార్జిగా ఈవోలుగా నియమితులైనవారు బహుముఖ బాధ్యతలు నిర్వహించలేక సతమతం అవుతున్నారు. వారంలో ఒకటి, రెండు రోజులు మత్రమే ఆలయానికి రావడంతో ఆలయంలో అభివృద్ధి పనులు కుంటు పడి భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. తెలంగాణలో ప్రసిద్ధి చెందిన దేవాలయం కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయం ప్రతి యేటా స్వామి వారిని సుమారు రూ.కోటికిపై భక్తులు దర్శించుకుంటారు. ఎక్కడా లేని విధంగా స్వామి వారి బ్రహ్మోత్సవాలు నాలుగు నెలల పాటు కొనసాగుతాయి, దీంతో స్వామి వారికి సంవత్సరానికి సుమారు రూ.20 కోట్లకు పైగానే ఆదాయం వస్తుంది. ఇంతటి ప్రాధాన్యత గల ఆలయానికి రెగ్యులర్ ఈవో లేకపోవడం దురదృష్టకరమని భక్తులు వాపోతున్నారు. తమ సమస్యలు పరిష్కరించే నాథుడే లేడని అంటున్నారు.

క్లుప్తంగా

పోలీసుల అదుపులో కొమురవెల్లి చోరీ నిందితుడు!

కొమురవెల్లి(సిద్దిపేట): మండల కేంద్రంలో ఇటీవల జరిగిన చోరీకి సంబంధించిన నిందితుడిని కొమురవెల్లి పోలీసులు శనివారం అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. ఖమ్మం జిల్లాకు చెందిన నిందితుడు కొమురవెల్లి మల్లికార్జున స్వామి దర్శనానికి వచ్చి పక్కగా రెక్కీ నిర్వహించి చోరీకి పాల్పడ్డాడు. మండల కేంద్రంలోని పోతుగంటి కొమురవెల్లి ఇంట్లో బుధవారం చోరీ జరిగినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. అయితే విషయమై ఎస్ఐ రాజును వివరణ కోరగా నిందితుడి కోసం గాలిస్తున్నట్లు చెప్పడం గమనార్హం.

బంధువుల ఇంటికి వెళ్తూ...

బైక్ అదుపుతప్పి కొడుకు మృతి
తల్లికి తీవ్ర గాయాలు


మృతుడు దానయ్య

హత్నూర(సంగారెడ్డి): బంధువుల ఇంటికి వెళ్తూ బైక్ అదుపుతప్పడంతో ఓ వ్యక్తి దుర్మరణం పాలవగా అతడి తల్లి తీవ్రంగా గాయపడింది. హత్నూర మండలం గోవిందరాజు పల్లి గ్రామ శివారులో శనివారం జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. హత్నూర మండలం సికిందలాపూర్ గ్రామానికి చెందిన కురుమ దానయ్య(42) అతడి తల్లి వీరమ్మతో కలిసి ఉదయం మెదక్ జిల్లా సోమక్కపేటలో ఉండే బంధువుల ఇంటికి బైక్‌పై బయల్దేరారు. సరిగ్గా గోవిందరాజు పల్లి గ్రామ శివారులో చేరుకునేసరికి బైక్ అదుపు తప్పి పక్కనున్న పొదల్లోకి దూసుకుపోయింది. ఈ ప్రమాదంలో దానయ్య అక్కడికక్కడే మృతి చెందగా వీరమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. అటుగా వెళ్తున్న పశువుల కాపరులు వీరిని చూసి పోలీసులకు సమాచారమివ్వడంతో వెంటనే ఘటనాస్థలికి చేరుకుని వీరమ్మను చికిత్స నిమిత్తం సంగారెడ్డిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. దానయ్య మృతదేహాన్ని పంచనామా నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

108 అంబులెన్స్‌లో ప్రసవం

తల్లీ బిడ్డా క్షేమం


బిడ్డను అప్పగిస్తున్న 108 సిబ్బంది

వర్గల్(గజ్వేల్): గజ్వేల్ మండలంలో ఓ గర్భిణిని ప్రసవం కోసం గాంధీ ఆస్పత్రికి అంబులెన్సులో తరలిస్తుండగా మార్గమధ్యంలోనే పండంటి మగ శిశువుకు జన్మనిచ్చింది. వర్గల్ మండలం గౌరారం వద్ద శనివారం జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. పిడిచేడ్ గ్రామానికి చెందిన పుల్ల కల్యాణికి నెలలు నిండటంతో పురుటినొప్పులు ప్రారంభమయ్యాయి. దీంతో శుక్రవారం సాయంత్రం గజ్వేల్‌లోని మాతాశిశు సంక్షేమ ఆస్పత్రిలో చేరింది. ఈ క్రమంలో ఆమెకు ఫిట్స్ రావడంతో అక్కడి వైద్యులు గాంధీ ఆస్పత్రికి రిఫర్ చేశారు. దీంతో శనివారం ఉదయం ఆమెను 108 అంబులెన్సులో తరలిస్తుండగా మార్గమధ్యంలోనే పురుటినొప్పులు అధికమయ్యాయి. దీంతో అంబులెన్స్ సిబ్బంది అప్రమత్తమై ఆమెకు ప్రసవం చేశారు. తల్లీ, మగశిశువు క్షేమంగా ఉన్నారని వారిని తిరిగి గజ్వేల్ ఆస్పత్రికి తరలించినట్లు అంబులెన్స్ సిబ్బంది తెలిపారు.

మద్యం తాగి వ్యక్తి మృతి

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని కంచన్‌పల్లిలో శనివారం అతిగా మద్యం తాగి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఘటన వివరాలిలా ఉన్నాయి. కంచన్‌పల్లి గ్రామానికి చెందిన నీలబోయిన నర్సింహులు(48) ప్లంబర్ పనిచేస్తుంటాడు. కాగా మద్యానికి బానిసై భార్య లావణ్య, తల్లి క్యాతమ్మతో గొడవ పడి కొట్టేవాడు. ఈ క్రమంలో శుక్రవారం భార్య, తల్లితో గొడవపడి బయటకు వెళ్లి అతిగా మద్యం తాగాడు. అనంతరం ఇంటికి వచ్చి నిద్రపోయాడు. నర్సింహులును భోజనానికి లేపితే ఎంతకూలేవకపోవడంతో అనుమానమొచ్చిన భార్య తరచి చూడగా భర్త మృతి చెందినట్లు గుర్తించింది. మృతుడి తమ్ముడు మల్లేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సర్కారీ స్కూళ్లకు సలామ్..!

కార్పొరేట్‌కు దీటుగా నిల'బడి'న వైనం

సండే స్పెషల్

- సత్ఫలితాలనిచ్చిన 'బడిబాట' కార్యక్రమం
- ప్రభుత్వ పాఠశాలల్లో పెరుగుతున్న ప్రవేశాలు
- దాతల వితరణ, టీచర్ల ప్రత్యేక కృషితో బడిలో చేరేందుకు మొగ్గు

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు జోరందుకున్నాయి. అడ్మిషన్లు పెంచేందుకు అటు ప్రభుత్వం తీసుకున్న చర్యలతోపాటు ఇటు సదరు పాఠశాలల ఉపాధ్యాయులు 'బడిబాట'పేరుతో చేసిన విస్తృత ప్రచారం సత్ఫలితాలనిచ్చింది. ఇదే ఊపును కొనసాగిస్తే జూలై చివరాఖరి వరకు ప్రవేశాలకు ఇంకా సమయం మిగిలి ఉండటంతో ప్రభుత్వం నిర్దేశించిన ప్రవేశాల లక్ష్యాన్ని చేరుకోవడం అసాధ్యమేమీ కాదు. ప్రభుత్వ బడుల్లో దాతల వితరణలతో మెరుగుపడిన మౌలిక వసతులు, విద్యార్థులకు పాఠ్య, నోటు పుస్తకాలు, పెన్నులు, స్కూల్ బ్యాగ్‌లు ఉచిత పంపిణీ వంటి అంశాలు అడ్మిషన్లు పెరిగేందుకు ఎంతగానో దోహదపడ్డాయి.


ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): డిజిటల్ పద్ధతిలో పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయులు


జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇందిరానగర్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అనేక ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నాయి. ఇందులో మొదటి వరుసలో సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఇందిరానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మొదటి వరుసలో ఉంటుంది. ఈ పాఠశాల అంటే విద్యార్థులకు, విద్యార్థుల తల్లిదండ్రులకు ఎంత క్రేజ్ అంటే...ఈ ఏడాది ఆరో తరగతిలో 180 సీట్లు ఉండగా 150 సీట్లు కాంప్లెక్స్ పాఠశాల పరిధిలోని విద్యార్థులకు కేటాయించగా... మిగిలిన 30 సీట్లకోసం ఏకంగా 340 దరఖాస్తులు వచ్చాయి. అందుకే ఈ పాఠశాలలో ప్రతీ ఏటా నో అడ్మిషన్ బోర్డు పెడుతుంటారు. ప్రస్తుతం ఈ పాఠశాలలో 1,217 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు.

ప్రత్యేకత ఏమిటి?

ఈ పాఠశాలలో పుస్తకాల్లోని చదువు మాత్రమే కాకుండా సమాజంలో ఎలా బతకాలో నేర్పిస్తారు. డిజిటల్ విద్యా బోధన, గ్రంథాలయం, క్రీడాప్రాంగణం, సైన్స్ ల్యాబ్, కంప్యూటర్ ల్యాబ్, ఇఫ్లూ (ఇంగ్లిష్ అండ్ ఫారెన్ లాంగ్వేజ్ యూనివర్సిటీ) ఆధ్వర్యంలో వివిధ భాషలలో శిక్షణ, కవిత్వం, ఆర్థిక, సామాజిక, తదితర అంశాలపై ప్రత్యేక శిక్షణ అందిస్తున్నారు. పాఠశాలకు సంబంధించిన నిర్వహణ మొత్తం ఆన్‌లైన్‌లోనే నిర్వహిస్తున్నారు.

విద్యార్థులు పోటీలు పడుతున్నారు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): విద్యార్థులు పోటీ పడి మరీ బడిలో చేరాలనుకుంటున్న పాఠశాలల్లో సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్‌లోని జిల్లా పరిషత్ పాఠశాల ఒకటి. ఇందులో చేరాలంటే విద్యార్థులు ముందుగా పరీక్ష రాసి అందులో ప్రతిభ చాటాలి. ఈ స్కూల్‌లో ప్రతీ ఏటా టెన్త్ నూరుకు నూరు శాతం ఉత్తీర్ణత సాధిస్తుండటంతోపాటుగా చదువులో వెనుకబడిన విద్యార్థులకు తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ సహకారంతో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఆధునిక పాఠశాల భవనం, ల్యాబ్, డిజిటల్ తరగతులతో విద్యాబోధన, వారానికి ఒకసారి లైఫ్‌స్కిల్‌పై ప్రత్యేక శిక్షణ, క్రీడా పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తుండటం ఈ స్కూల్ ప్రత్యేకతలు. దీంతో విద్యార్థులు ఇక్కడ చదువుకునేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. గతేడాది 410మంది విద్యార్థులుండగా ప్రస్తుతం 545 మంది విద్యనభ్యసిస్తున్నారు. ప్రస్తుతం పాఠశాలలో నో అడ్మిషన్ బోర్డు పెట్టినప్పటికీ తమ పిల్లలకు ప్రవేశం కోసం వివిధ మార్గాల ద్వారా రికమండేషన్స్ చేయిస్తున్నారు.


ఝరాసంగంలోని కస్తూర్బా విద్యాలయం

మోడల్ స్కూల్ లో అడ్మిషన్లు ఫుల్

ఝరాసంగం(జహీరాబాద్): సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలంలోని మోడల్ స్కూల్‌లో అర్హత కలిగిన ఉపాధ్యాయులతో విద్యాబోధనతోపాటు వృత్తి విద్యా బోధన కూడా చేస్తుండటంతో విద్యార్థులు ఈ ప్రభుత్వ బడిలో చదివేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. ఆరవ తరగతి నుంచి పదవ తరగతి వరకు ఈ పాఠశాలలో బోధిస్తున్నారు. పదో తరగతి ఫలితాల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించడంతో ఈ స్కూల్‌లో అడ్మిషన్లకు మంచి డిమాండ్ ఏర్పడింది.

లక్ష్యానికిపైగా కస్తూర్బాలో అడ్మిషన్లు

కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో లక్ష్యానికిపైగా అడ్మిషన్లు ఉన్నాయి. ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ వహించి పదో తరగతిలో 100% ఫలితాలు సాధిస్తుండటంతో 208 మంది బాలికలు వసతిగృహంలో ఉండి చదువుకుంటున్నారు.

అదనంగా గంట సేపు బోధన


వివిధ పరికరాలతో విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయులు

నర్సాపూర్ రూరల్: మెదక్ జిల్లా నర్సాపూర్ మండలంలోని తుజాల్‌పూర్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు ప్రతీ విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధపెట్టి చదివిస్తుండటంతోపాటు ఆటపాటలు, సంస్కృతి సంప్రదాయాలను కూడా బోధిస్తుండటం గ్రామస్తుల్ని బాగా ఆకర్షించింది. పైగా ఈ గ్రామం నుంచి ప్రైవేట్ పాఠశాలకు వెళ్లే విద్యార్థులకన్నా ఈ బడిలో చదివిన విద్యార్థులే మంచి ఫలితాలు సాధించారు. దీంతో తమ పిల్లలను ఈ స్కూల్‌లోనే చేర్పించారు. ఈ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శివకుమార్ అదనంగా గంట సమయాన్ని కేటాయించి పాఠాలు బోధించేలా చేశారు. ఉపాధ్యాయులు సొంత డబ్బులతోపాటు దాతల సహకారంతో విద్యార్థులకు అవసరమైన టై, బెల్టులు, గ్రీన్ బోర్డులు ఏర్పాటు చేసుకున్నారు. ప్రతీనెల స్లిప్ టెస్టులు పెడుతూ సీ గ్రేడ్‌లో ఉన్న విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేకంగా బోధిస్తున్నారు. దీంతో గతేడాది 1 నుంచి 5వ తరగతి వరకు 33 మంది విద్యార్థులు మాత్రమే విద్యను అభ్యసించగా...ప్రస్తుతం 65 మంది విద్యనభ్యసిస్తున్నారు. దీంతో ఈ ఏడాది ఆరోవ తరగతి వరకూ అప్‌గ్రేడ్ చేస్తూ అధికారులు ప్రాథమికోన్నత పాఠశాలగా ప్రకటించారు.

ప్రత్యేక శ్రద్ధతో పెరిగిన ప్రవేశాలు


డప్పూర్‌లో ఇల్లిల్లు తిరిగి ప్రభుత్వ బడుల ప్రాముఖ్యతను వివరిస్తున్న ఉపాధ్యాయులు

న్యాల్‌కల్(జహీరాబాద్): సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండల పరిధిలోని మామిడ్గి ప్రాథమిక పాఠశాలలో విద్యనభ్యసించేందుకు విద్యార్థులు ఎక్కువ ఆసక్తిని కనబరుస్తున్నారు. గతేడాది 129 మంది విద్యార్థులు ఉండగా ప్రస్తుతం 140కి పైగా విద్యార్థులు ఉండటమే ఇందుకు నిదర్శనం. ఈ బడిలో టీచర్లతోపాటు దాతల సహకారంతో విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, ప్లేట్లు, పెన్నులు, బ్యాగ్‌లు వంటి వాటిని ఉచితంగా అందిస్తుండటంతో విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ఈ బడిలో చేర్పించేందుకు ముందుకు వస్తున్నారు. ఇక డప్పూర్ పాఠశాలలో హెచ్ఎం జావీద్ ఉపాధ్యాయుల బృందంతో కలిసి ఇల్లిల్లు తిరిగి విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా అవగాహన కల్పించారు. దీంతో ఈ ఏడాది ప్రవేశాలు పెరిగాయి. గతేడాది 70 మంది విద్యార్థులు ఉండగా ఈ సంవత్సరం 110 విద్యార్థులు చేరారు. ఇక హద్నూర్ పాఠశాలలో ఈ ఏడాది కొత్తగా 40 మందికి పైగా విద్యార్థులు చేరారు.

ప్రైవేట్ స్కూళ్ల నుంచి వచ్చి మరీ..


పాఠశాలలో విద్యార్థులు

నారాయణఖేడ్: విద్యార్థుల అడ్మిషన్లకోసం ప్రతీ ఏటా పోటీ నెలకొనే స్కూళ్లలో ఖేడ్‌లోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ఒకటి. పాఠశాలలో సాయంత్రం సమయంలో హెచ్ఎం మన్మథకిషోర్ ఆధ్వర్యంలో స్పోకెన్ ఇంగ్లిష్, వెనుకబడ్డ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ గంటసేపు క్లాసులు, చదువులో వెనుకబడ్డ విద్యార్థులకు పాఠ్యాంశాల పట్ల ప్రత్యేకంగా బోధిస్తుండటంతో ఈ స్కూల్‌లో చదివేందుకు విద్యార్థులు ఆసక్తి చూపిస్తున్నారు. ఎమ్మెల్యే సంజీవరెడ్డి సహకారంతో ఈ స్కూల్‌లో బ్రైట్ చైల్డ్ ఫౌండేషన్ ద్వారా కంప్యూటర్ శిక్షణ కొనసాగుతోంది. ఇదే పాఠశాలకు చెందిన హిందీ ఉపాధ్యాయుడు చంద్రశేఖర్ ఆచార్య సేవోద్యం ఫౌండేషన్ ద్వారా 800 మందికి బ్యాగులు, ఇంగ్లిష్ డిక్షనరీలు, నెట్‌డాటా సంస్థ సహకారంతో 4 ల్యాప్‌టాప్‌లు, లయన్స్‌క్లబ్ సౌజన్యంతో క్రీడా సామగ్రి, మార్చి ఫాస్ట్ డ్రెస్‌లు, ఇతర దాతర సహకారంతో స్పోర్ట్స్ డ్రెస్సులు, గుర్తింపు కార్డులు ఉచితంగా అందజేస్తున్నారు. ఖేడ్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి,జక్కుల యాదగిరి సౌజన్యంతో రూ.3లక్షల విలువైన మినరల్ వాటర్‌ప్లాంటును విద్యార్థుల సౌకర్యార్థం పాఠశాలలో ఇటీవలే ఏర్పాటు చేశారు. న్యాయవాది అనుపమారెడ్డి సహకారంతో తరగతి బోధనలో ఉపాధ్యాయులకు ఉపయోగపడే సౌండ్‌సిస్టమ్‌ను ఇచ్చారు. దీంతో ఈ ఏడాది అడ్మిషన్లు కూడా భారీగానే పెరిగాయి. గతేడాది 800 మంది విద్యార్థులు ఉండగా ఈ ఏడాది మరో 850 మంది అడ్మిషన్లు పొందారు. ఇక ప్రైవేట్ స్కూళ్ల నుంచి కూడా 150 మంది విద్యార్థులు ఈ స్కూల్‌లో ప్రవేశాలు తీసుకున్నారు.


జెడ్పీహెచ్ఎస్ పాఠశాల

కోనాయిపల్లి గ్రామస్తుల తీర్మానం


కోనాయిపల్లి(పీబీ) ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు

తూప్రాన్: మెదక్ జిల్లా తూప్రాన్ మండలంలోని కోనాయిపల్లి(పీబీ) గ్రామస్తులు తమ పిల్లలను ప్రైవేటు స్కూలుకు పంపించవద్దని తీర్మానించుకున్నారు. గ్రామానికి ప్రైవేట్ పాఠశాలల బస్సులు రాకుండా చర్యలు తీసుకున్నారు. గ్రామంలోని 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించారు. ఇదే గ్రామం నుంచి ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లే 20 మందికి పైగా విద్యార్థులను కూడా ప్రభుత్వ పాఠశాలలో చేరారు.

వాలంటీర్‌కు గ్రామస్తులే వేతనం

గ్రామస్తులు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్న లక్ష్యంతో ఒక వాలంటర్‌ను కూడా నియమించి ప్రతీ నెల రూ.5వేల చొప్పున వేతనం గ్రామస్తులే అందిస్తున్నారు. కార్పొరేట్ స్థాయిలో ఇంగ్లిష్‌లో బోధన, ప్రత్యేక యూనిఫాం, వివిధ రకాల క్రీడలు తదితర విభాగాల్లో శిక్షణనిస్తుండటంతో విద్యార్థులు ఈ సర్కారు బడికి ఆకర్షితులయ్యారు.

ఫలించిన బడిబాట

పాఠశాలల పునఃప్రారంభానికి ముందు నుంచే ప్రభుత్వం ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణతోపాటు బడిబాట కార్యక్రమం చేపట్టింది. ఉపాధ్యాయులు విద్యార్థులను బడిలో చేర్చుకునేందుకు ఇంటింటా ప్రచార కార్యక్రమాలు నిర్వహించి గ్రామస్తుల ద్వారా సత్ఫలితాలు సాధించారు.

హెచ్‌ఎం సొంత నిధులు


హెచ్‌ఎం జయప్రకాశ్‌రెడ్డి

కొండపాక(గజ్వేల్): దూర ప్రాంతాలనుంచి విద్యార్థులు తమ స్కూలు వచ్చేందుకు ఏడాది పాటు ఆటో ద్వారా రవాణా సౌకర్యాన్ని కల్పిస్తున్నారు సిద్దిపేట జిల్లా కొండపాక మండలం సిర్సనగండ్లలోని ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జయప్రకాశ్‌రెడ్డి. దీంతోపాటుగా పాఠశాల ఆవరణలో ఆట వస్తువులు క్రీడా దుస్తులు, స్వచ్ఛమైన తాగు నీటి ఆర్వో ప్లాంట్, ఐఎఫ్‌బీ స్క్రీన్ ఎల్ఈడీ ప్యానల్, కంప్యూటర్, తరగతి గదుల్లో కార్పెట్లు, పాఠశాలకు అందమైన రంగులు వేయడం వంటి వాటి కోసం సుమారు రూ. 9లక్షలను తన సొంత డబ్బుల్ని ఖర్చుపెట్టి పాఠశాలకు మంచి పేరు తీసుకొచ్చారు. ఇక బడిబాట కార్యక్రమంలో ఇల్లిల్లూ తిరుగుతూ పాఠశాలలో లభించే వసతులు, సౌకర్యాల గురించి వివరించడంతో తమ పిల్లలను ఈ బడిలో చేర్పించేందుకు ముందుకు వచ్చారు. సుమారు 70 మందికిపైగా ప్రైవేట్ స్కూల్‌కు వెళ్లే విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చేరారు. ప్రస్తుతం 210 మంది విద్యార్థులు ఈ బడిలో చదువుకుంటున్నారు.


హెచ్ ఎం ఏర్పాటు చేసిన ఆటోలో వచ్చిన విద్యార్థులు

పొలం తన పేరున కాక.. అప్పులు తీర్చలేక

పురుగు మందు తాగి రైతు ఆత్మహత్య


చంద్రయ్య

హవేళీఘణాపూర్(మెదక్): అప్పు చేసి కొనుగోలు చేసిన పొలం తన పేరున కాకపోవడం, ఇంటి అవసరాలకు చేసిన అప్పులు పేరుకుపోవడంతో జీవితంపై విరక్తి చెందిన రైతు పురుగు మందు సేవించి ఆత్మహత్య చేసుకున్న ఘటన మెదక్ జిల్లా హవేళీఘణాపూర్ మండలం చౌట్లపల్లి గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన చీమల చంద్రయ్య (55) కొంతకాలం క్రితం అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి వద్ద 20 గుంటల పొలం అప్పు చేసి కొనుగోలు చేశాడు. ఆ పొలం తన పేరున కాకపోవడంతో పలుమార్లు అధికారుల చుట్టూ తిరుగుతున్నాడు. అయినా సమస్య పరిష్కారం కాకపోవడంతో మనస్తాపానికి గురై శనివారం ఉదయం పొలం వద్దకు వెళ్లి పురుగు మందు సేవించాడు. గమనించిన చుట్టుపక్కల రైతులు కుటుంబీకులకు సమాచారం అందించగా, అప్పటికే అపస్మారక స్థితికి చేరుకున్నాడు. వెంటనే 108లో మెదక్ ఆస్పత్రికి తరలించగా, మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ గాంధీకి తరలించేలోపే మృతిచెందాడు. పొలం కోసం, ఇంటి అవసరాల కోసం అప్పులు అయ్యాయని బాధపడుతూ ఉండేవాడని, కొనుగోలు చేసిన భూమి కూడా తన పేరునకాకపోవడంతో ఇటీవలే ప్రభుత్వం చేపట్టిన భూభారతి కార్యక్రమంలో దరఖాస్తు కూడా సమర్పించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. రైతు చంద్రయ్య పేరున పొలం లేకపోవడంతో రైతుబీమా సైతం వర్తించిందని, ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

రైలు పట్టాలపై యువతి


మృతురాలు స్వర్ణ

తూప్రాన్: రైలు పట్టాలపై యువతి బలవన్మరణంకు పాల్పడిన ఘటన శనివారం పట్టణ సమీపంలోని బ్రహ్మణపల్లి రైల్వేస్టేషన్ సమీపంలో చోటుచేసుకుంది. కామారెడ్డి రైల్వే పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శివ్వంపేట మండలం దొంతి గ్రామానికి చెందిన శవర్తి నర్సవ్వ, శంకర్ దంపతుల మూడో కూతురు స్వర్ణ(24) కొన్నేళ్లుగా మనోహరాబాద్ మండలం రామాయిపల్లి గ్రామ సమీపంలోని ఓ ప్రైవేట్ పరిశ్రమలో పని చేస్తుంది. ఈ క్రమంలోనే రోజు మాదిరిగా ఉద్యోగానికి వెళ్లిన యువతి ఇంటికి చేరుకుంది. అనంతరం తూప్రాన్‌లో పని ఉందని ఇంటి నుంచి బయల్దేరిన స్వర్ణ బ్రహ్మణపల్లి రైల్వేస్టేషన్‌కు చేరుకుంది. ఈ క్రమంలో సికింద్రాబాద్ నుంచి జైపూర్ వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ రైలు వస్తుండగా ఒక్కసారిగా దూకేసింది. దీంతో స్వర్ణ అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని పంచనామా నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతికి కారణాలు తెలియాల్సి ఉంది

దొంగతనం కేసులో రిమాండ్

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని గుండారంలో ఎస్ఐ తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో శనివారం తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన వాసాల మధుసూదన్‌రెడ్డి అనే దొంగను పట్టుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. గుండారంలో ఇటీవల రెండు ఇళ్లలో చోరీ జరగగా, గ్రామంలో పోలీసులు టీంలుగా గాలింపు జరిపారు. అనుమానాస్పదంగా తిరుగుతున్న మధుసూదన్‌రెడ్డిని పట్టుకొని విచారించగా, చోరీ చేసినట్లు అంగీకరించాడు. రెండున్నర తులాల బంగారం, 67 తులాల వెండి వస్తువులను చోరీ చేసినట్లు పోలీసులు తెలిపారు. బంగారాన్ని బెజ్జంకిలో కుదవపెట్టి రెండు విడతలుగా సుమారు 1.30 లక్షలు తీసుకున్నాడు. కుటుంబ అవసరాలకు పోను మిగితావి జల్సాలకు ఖర్చు చేశారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

నోట్‌పుస్తకాలు పంపిణీ

హత్నూర (సంగారెడ్డి): హత్నూర మండలం కొన్యాలలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం నోట్‌పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు ఉచితంగా పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన నాండ్ల అనురాధ వీరన్న దంపతులు, వారి కుమారులు దామోదర్, సత్యనారాయణ, జయంత్, దీక్షిత్ కలిసి పాఠశాల విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందజేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమేశ్ శనివారం విలేకరులకు తెలిపారు.

సంగారెడ్డి టౌన్: సంగారెడ్డి పట్టణ శివారులోని శిశు మందిర్ పాఠశాలలో ఐదు నుంచి పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు పట్లోల్ల శ్రీనివాస్‌రెడ్డి జ్ఞాపకార్థంగా వారి కుమారులు నోట్ పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రశాంత్ రెడ్డి, సమరసింహారెడ్డి, ప్రభు గౌడ్, ప్రధానాచార్యులు నరసింహా గౌడ్, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు మైక్‌సెట్ వితరణ

వర్గల్(గజ్వేల్): వర్గల్ మండలం చాంద్‌ఖాన్ మక్త ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు గజ్వేల్ స్నేహా లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మల్లేశం గౌడ్ రూ.7,500 విలువైన ఈ మైక్‌సెట్‌ను ఉచితంగా అందజేశారు.

స్కూల్ బ్యాగులు పంపిణీ

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని కామారం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు, అంగన్‌వాడీ పిల్లలకు ఎన్ఆర్ఐ లింబాద్రి స్వామి తన అమ్మమ్మ బండ్ల వెంకటమ్మ జ్ఞాపకార్థం నోట్‌బుక్స్, స్కూల్ బ్యాగ్‌లు, యూనిఫాంను ఉచితంగా అందజేశారు. త్వరలోనే పాఠశాల విద్యార్థులకు డెస్క్ బెంచీలను అందిస్తానన్నారు.

హత్య కేసులో నిందితుడికి రిమాండ్

- నాలుగు రోజుల్లో కేసును ఛేదించిన పోలీసులు
- సిబ్బందిని అభినందించిన జిన్నారం సీఐ నయీముద్దీన్


హత్య కేసులో నిందితుని అరెస్టు చూపుతున్న సీఐ నయీముద్దీన్

హత్నూర(సంగారెడ్డి): హత్నూర మండలం కాసాల గ్రామానికి చెందిన ఎరుకలి శ్రీను (25) హత్య కేసును పోలీసులు నాలుగు రోజుల్లో ఛేదించి నిందితుడిని రిమాండ్‌కు పంపించారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు పోలీసుల కథనం ప్రకారం ఇలా ఉన్నాయి. కాసాల గ్రామ శివారులోని ఇప్పలకుంట సమీపంలో ఓ గుర్తుతెలియని కాలిపోయిన మృతదేహాన్ని ఈనెల 25న పోలీసులు గుర్తించారు. ఈ కేసు దర్యాప్తును ప్రారంభించిన పోలీసులు మృతదేహాన్ని కాసాల గ్రామానికి చెందిన ఎరుకలి శ్రీనుగా గుర్తించారు. హత్యకు గురైన శ్రీను అతని బంధువైన దౌల్తాబాద్ గ్రామానికి చెందిన ఎరుకలి మల్లేశం కంపెనీలో పనిచేసేవాడు. గతంలో వీరిద్దరూ దొంగతనం కేసులో నేరస్తులుగా ఉండటంతోపాటు ఇతర తగాదాల్లో కూడా ప్రమేయం ఉంది. ఒక విషయంలో వీరిద్దరి మధ్యా మనస్పర్థలు ఏర్పడ్డాయి. ఈనెల 25న వీరిద్దరికీ కోర్టులో కేసు ఉండటంతో శ్రీను ఈనెల 24న బీరంగూడ నుంచి దౌల్తాబాద్‌కు వచ్చాడు. ఈ క్రమంలో ఇద్దరూ కలిసి మద్యం తాగుతున్న సమయంలో పథకం ప్రకారం మల్లేశం వెంటతెచ్చుకున్న బ్లేడుతో శ్రీనుపైదాడి చేయగా అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం శ్రీను మృతదేహాన్ని మల్లేశం గ్రామశివారులోని ఇప్పలగుంట సమీపంలో పడేసి పెట్రోల్ పోసి తగలబెట్టాడు. విచారణలో నేరం ఒప్పుకోవడంతో మల్లేశంను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. త్వరితగతిన హత్య కేసును ఛేదించిన హత్నూర పోలీస్ సిబ్బందిని సీఐ నయీముద్దీన్ అభినందించారు.

మట్టి రవాణాకు పాల్పడితే క్రిమినల్ కేసులు

సాక్షి ఎఫెక్ట్

జిన్నారం (పటాన్‌చెరు): అక్రమ మట్టి రవాణాపై పలు పత్రికల్లో వచ్చిన కథనాలకు రెవెన్యూ యంత్రాంగం స్పందించింది. రాళ్లకత్వ గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 286లో కొంతకాలంగా అక్రమార్కులు ప్రభుత్వ భూముల నుంచి మట్టి రవాణాకు పాల్పడుతున్నారు. తహసిల్దార్ దేవదాస్, ఎస్ఐ నాగలక్ష్మి శనివారం మట్టి రవాణా చేస్తున్న భూములను పరిశీలించారు. అనంతరం గ్రామస్తులను కలిసి మట్టి రవాణపై ఆరా తీశారు. ప్రభుత్వం నిరుపేద రైతులు వ్యవసాయం చేసేందుకు అసైన్డ్ భూములను ఇచ్చిందన్నారు. అలా కాకుండా చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడితే శిక్షార్హులు అవుతారని హెచ్చరించారు. ఇప్పటికైనా అక్రమ మట్టి రవాణాను ఆపాలని లేకపోతే ఆ భూములను తిరిగి స్వాధీనం చేసుకుంటామని స్పష్టం చేశారు.


గ్రామస్తులతో మాట్లాడుతున్న తహసీల్దార్ దేవదాస్, ఎస్ఐ నాగలక్ష్మి